ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: డీఎస్పీ



మిర్యాలగూడలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు హెచ్చరించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు అన్ని రకాల పత్రాలు కలిగి ఉండడంతో పాటు.. నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని సూచించారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆపడంతో వెనుక వచ్చే వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా రాజీవ్‌చౌక్ నుంచి రాఘవ థియేటర్ వరకు ఆటోల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. యూనిఫాం ధరించాలన్నారు. బస్టాండ్‌లోకి ఆటోలకు సూచించిన మార్గం ద్వారానే రాకపోకలు సాగించాలన్నారు. డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, ఒకటో, రెండో పట్టణ సీఐలు కరుణాకర్, నాగార్జున, ట్రాఫిక్ ఎస్సై మోహన్‌బాబు, రెండో పట్టణ ఎస్సై రాంబాబు, ఆర్టీసీ డిపో సహాయ మేనేజర్లు భారతీ బాయి, యాదగిరి పాల్గొన్నారు.


రైల్వే క్రాసింగ్ దారిలో రాకపోకల నిలిపివేత

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాల-ఉరుమడ్ల దారిలో ఉన్న రైల్వే లెవెల్ క్రాసింగ్ మీదుగా (ఈ నెల 5నుంచి ఏడో తేదీ వరకు) 3 రోజుల పాటు వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజినీరు ఎం.రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిట్యాల-రామన్నపేట రైల్వే స్టేసన్ల మధ్య కి.మీ 49//7-8 వద్ద ఉన్న 26వ నెంబరు మానవ సహిత కాపలా లెవెల్ క్రాసింగ్‌ను ఈ దారిలోని రైల్వే లైను ఓవర్ హాలింగ్ పనుల నిర్వహణ నిమిత్తం తాత్కాలికంగా రాకపోకలను నిలిపివేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఈనాడు, నల్గొండ :

ఇసుక అక్రమ రవాణా నియంత్రణలో వైఫల్యం చెందడంతో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పనిచేస్తున్న 15 మంది ఎస్సైలపై ఉన్నతాధికారులు వేటు వేయడం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. మల్టీజోన్-2లో వేటు పడ్డ వారిలో ఉమ్మడి జిల్లా ఎస్సైలే అత్యధికంగా ఉండటం గమనార్హం. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక పాలసీపై విధాన నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రభుత్వ రీచుల నుంచి గత కొంత కాలంగా ఇసుక రవాణా నిలిచిపోయింది. దీంతో ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల ద్వారా కొంత మంది అక్రమార్కులు ఉమ్మడి జిల్లాలోని మూసీ, కృష్ణా నది పరివాహక ప్రాంతాల వాగులు, వంకల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ల అండతో యథేచ్ఛగా ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు.

■ గతంలో తుంగతుర్తి నియోజకవర్గంలోని అడ్డగూడూరు, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మోత్కూరు, మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి, అడవిదేవులపల్లి, వాడపల్లి, నల్గొండ నియోజకవర్గంలోని కనగల్, తిప్పర్తి, నాగార్జునసాగర్‌లో హాలియా, సూర్యాపేటలో ఆత్మకూరు(ఎస్), పెన్‌పహాడ్, మునుగోడులో చండూరు, ఆలేరులో గుండాల మండలాల్లోని వాగులు, రీచుల నుంచి ఇసుక సరఫరాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా.. కొంత మంది అక్రమార్కులు దానిని హైదరాబాద్‌కు తరలించేవారు. తుంగతుర్తిలోని వంగమర్తి రీచుతో పాటూ జాజిరెడ్డిగూడెం నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్‌కేంద్రానికి ఇసుక సరఫరా పేరుతో వేల లారీలను హైదరాబాద్‌కు తరలించారు. ప్రాజెక్టుల పేరుతోనూ అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగింది. కొత్త ప్రభుత్వంలోనూ ఇదే విధమైన ఎత్తుగడులు వేద్దామని ప్రణాళికలు రూపొందించినా ప్రభుత్వ విధానం, మూసీలో ఉద్ధృత ప్రవాహం ఉండటంతో అక్రమార్కుల ఎత్తుగడలు సాగడం లేదు. దీంతో కొన్ని రీచుల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గట్టుపైకి తీసుకొచ్చి వాటిని లారీల్లో డంప చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.



ఎప్పటికప్పుడు నిఘా వర్గాల ఆరా..

■ ఇసుక ఆదాయం ఉన్న పోలీసు స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం బాగా డిమాండ్ ఉంది. కొంత మంది రాజకీయ నాయకులు జిల్లా పోలీసు అధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చి ఫలానా పోస్టింగ్‌లు ఇవ్వాలని సూచిస్తున్నారు.

■ ఇటీవల నల్గొండ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఇసుక ఆదాయం ఉన్న మూడు పోలీసు స్టేషన్లకు పోస్టింగ్‌ల కోసం సదరు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ఆశ్రయించగా ఏకంగా ఒక్కో పోలీసు స్టేషన్‌కు నాలుగు నుంచి ఐదుగురికి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారి ఏదో ఒక పేరుతో మాత్రమే సిఫార్సు లేఖ ఇస్తేనే పోస్టింగ్ ఇస్తామని స్పష్టం చేసినట్లు సమాచారం. మరికొంత మంది ప్రజాప్రతినిధులు పోస్టింగ్‌ల కోసం వచ్చే అధికారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు గతంలో లాగా కాకుండా జిల్లా ఎస్‌బీ విభాగంతో పాటూ రాష్ట్ర నిఘా విభాగం ఆదాయం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులపై ఎప్పటికప్పుడు నిఘా వేసి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఇటీవల వేటు పడ్డ అధికారులపై గత ఆరు నెలల నుంచి పక్కాగా సమాచారం సేకరించి జిల్లా ఉన్నతాధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపడంతో ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

అక్రమ రవాణా అరికట్టనందుకే...

ఇసుక అక్రమ రవాణా కట్టడిలో అక్రమార్కులకు అండగా ఉంటున్నారనే నివేదికల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి డివిజన్‌లో పనిచేస్తున్న మరికొంత మంది పోలీసు అధికారులపై త్వరలోనే చర్యలు ఉండనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా రాచకొండ పరిధిలోనే ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు ఇప్పటికే నిఘా వర్గాలు గుర్తించాయి. ఇప్పటికే నివేదికలు ప్రభుత్వానికి చేరాయని. . ఒకట్రెండు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశం ఉన్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి 'ఈనాడు'కు వెల్లడించారు.



వానాకాలంలో.. సూర్యప్రతాపం



గత వారం నుంచి జిల్లా ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. పగలు ఎండ, ఉక్కపోత, అప్పుడప్పుడు వర్షాలు, రాత్రిళ్లు చలి తీవ్రత ఉండటంతో ఎక్కువ మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో చలితీవ్రత ఉండాల్సినా. . 30 డిగ్రీలకు తగ్గకుండా ఎండలు కాస్తున్నాయి. దీంతో పాటు వాతావరణంలో మార్పులు, వాహనాల కాలుష్యం ఉక్కపోతల కారణంగా ప్రతి వందమందిలో 10 మంది శ్వాస సంబంధిత వ్యాధులతో పాటు చర్మవ్యాధులు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో విషజ్వరాలు, జలుబు, దగ్గు, తలనొప్పి, ఎముకల నొప్పులు వంటి సమస్యలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే



పెరుగుతున్న మధుమేహ బాధితులు..

వాతావరణ మార్పుల కారణంగా సరైన వ్యాయామం చేయకపోవడంతో మధుమేహం, హైబీపీ బాధితులు పెరుగుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) సర్వేలో 2.39 లక్షల మంది మధుమేహ బాధితులు ఉన్నట్లు గుర్తించారు. 3.26 లక్షల మంది హైబీపీతో బాధపడుతున్నారు. శ్వాస, గొంతు, జలుబు, చర్మవ్యాధులు, ఇతర విషజ్వరాలతో ఇబ్బంది పడుతున్న వారు 3.72 లక్షల మంది వరకు ఉంటారని వైద్య శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



భారంగా మందుల ఖర్చులు..

జిల్లా కేంద్రంలోని రామగిరి ప్రాంతానికి చెందిన విజయ్‌కుమార్ పది రోజులుగా శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యులను సంప్రదిస్తే రెండు రకాల మాత్రలతో పాటు నాజల్ డ్రాప్స్ రాశారు. వీటికి సమారు రూ.2,500 పైగా ఖర్చు అయింది. అయినా పరిస్థితి మెరుగవలేదు. ఇలాంటి వారు జిల్లాలో కుటుంబానికి ఒకరిద్దరు ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అంచనా వేస్తోంది. ఒక్కో కుటుంబంలో వారానికి మాత్రలకు రూ.2 నుంచి రూ.3 వేల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది.

గడిచిన వారం ఉష్ణోగ్రతల వివరాలు

తేది	గరిష్ఠం	కనిష్ఠం
4న	31.6	24.6
3న	31.6	24.3
2న	31.5	24.4
1న	32.0	29.0
30న	31.5	24.6
29న	32.0	24.4
28న	31.0	24.0
27న	30.0	23.0

జాగ్రత్తలు తప్పనిసరి:

– డా.రాపోలు అనిల్ కుమార్, జనరల్ ఫిజీషియన్, నల్గొండ

వాతావరణంలో హెచ్చుతగ్గుల మూలంగా చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులతో పాటు జ్వరం, జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యలతో బాధితులు ఎక్కువగా వస్తున్నారు. వేడినీళ్ల స్నానంతో పాటు, కాచి వడగాసిన నీరు తాగడం శ్రేయస్కరం. ఉన్ని దుస్తులు, గరం కోట్లు, చెవులకు గాలి తగలకుండా చూడటంతో పాటు తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. జ్వరం, ఒళ్లు నొప్పులు అనిపిస్తే పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచన మేరకు మందులు వాడటం మంచిది.

ఆకాశం వర్షించి.. శేషిలేటి హర్షించి..



శేషిలేటి వాగు వరద ఉద్ధృతి పెరగడంతో రాకపోకలు నిలిపివేసిన గ్రామస్థులు

నాంపల్లి, న్యూస్‌టుడే: ఉదయ సంధ్య వేళనే బండలు పగిలే ఎండ.. మధ్యాహ్నం ఉక్కపోత.. సాయంత్రం వరుణుడి రాక.. ఇదో విచిత్ర వాతావరణ పరిస్థితి. వారం రోజులుగా వాతావరణ శాఖ ఏర్పాటు చేసిన యాప్‌లలో తెలియని పరిస్థితి నెలకొంది. శుక్రవారం నాంపల్లి మండలంలో వేసవి మాదిరి ఎండలు కాశాయి. మరి కొన్ని ఊర్లల్లో మబ్బులు కమ్ముకొని చీకటి అలుముకొని ఏం జరుగుతుందో తెలియని స్థితి నెలకొంది. మండల కేంద్రంలో సాయంత్రం చీకట్లు కమ్ముకొని భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గంటన్నర పాటు కురిసిన వర్షంతో రాందాస్ తండా సమీపంలో ప్రవహించే శేషిలేటి వాగు వాహనాలను దాటనీయకుండా ప్రవహించడం దశాబ్ద కాలంలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

వసూల్ రాజాలపై నిఘా వర్గాల విచారణ

ఈనాడు, నల్గొండ: వ్యవసాయ శాఖలో 'వసూల్‌రాజా'ల పేరుతో శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టారు. నిఘా, ప్రత్యేక బ్రాంచి విభాగాలతో ఉన్నతాధికారులు మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, మాడుగులపల్లి, వేములపల్లి మండలాల్లో దుకాణాల నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించారు. విచారణ జరుపుతున్న అధికారులకు వ్యవసాయశాఖలో పనిచేస్తున్న అధికారులు బినామీలతో ఎరువుల దుకాణాలను ఏర్పాటు చేసిన విషయం వెలుగుచూసింది. దామరచర్ల మండలం రాళ్లవాగుతండాలో ఓ దుకాణం ఓ మండల వ్యవసాయాధికారికి చెందినది కాగా, మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడులో ఉన్న దుకాణం మరో మండల సహాయ అధికారిదిగా గుర్తించారు. నందిపాడులోనే మరో దుకాణం ఓ మండల సహాయ అధికారిది కాగా.. వీటిపై నివేదిక అందజేయనున్నట్లు సమాచారం.

నేడు సాగర్‌కు మంత్రి పొంగులేటి

తిరుమలగిరి(సాగర్), నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని రైతులు, పలు శాఖల అధికారులతో ముఖాముఖిగా చర్చించేందుకు శనివారం రెవెన్యూ,



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

పౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నెల్లికల్‌కు రానున్నారు. ఉదయం 11 గంటలకు గ్రామంలో ఏర్పాటు చేసే సమావేశంలో పాల్గొని రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకోనున్నారు. మధ్యాహ్నం సాగర్ విజయవిహార్‌కు చేరుకొని భోజన అనంతరం అధికారులతో సమీక్షించి అనంతరం హైదరాబాద్ వెళ్తారని అధికారులు తెలిపారు. సభా స్థలాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పరిశీలించి పలువురి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కుస్తీ పోటీలు

ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలోని అప్పాజీ మైదానంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, మెదక్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు 300 మంది పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాకు



నల్గొండ క్రీడాకారుల వందన సమర్పణ

చెందిన క్రీడాకారులు పోటీలకు దూరంగా ఉన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి జాతీయ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం కాగా ఆదిలాబాద్ క్రీడాకారులు వందన సమర్పణ చేస్తూ ముందుకు కదిలారు. మహబూబ్‌నగర్ క్రీడాకారులతో ఈ కార్యక్రమం ముగిసింది. తదుపరి ఎమ్మెల్యే పోటీలను లాంఛనంగా మొదలెట్టారు. మధ్యాహ్నం పెద్ద వర్షం పడటంతో మైదానంలో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.

తప్పులకు ఆస్కారం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి: కలెక్టర్

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా నూటికి నూరు శాతం వానాకాలం ధాన్యం సేకరణ చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. 2024-25 వానాకాలం ధాన్యం సేకరణపై శుక్రవారం మండల స్థాయి బృందాలతో నిర్వహించిన దూర దృశ్య శ్రవణ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా పోలీసు అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, చెక్ పోస్టుల వద్ద తనిఖీ కట్టుదిట్టం చేయాలన్నారు. జిల్లాలో ధాన్యం తీసుకెళ్లే వాహనాలకు ప్రత్యేకంగా స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సారి నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల చేయడం, ఇతర కారణాల వల్ల జిల్లాలో 20 వేల ఎకరాలలో అదనంగా వరి పండించినట్లు చెప్పారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించడంతో రాష్ట్రంలోనే నల్గొండ జిల్లాలో అత్యధికంగా వరి పంట మార్కెట్‌కు రానుందని తెలిపారు. జిల్లా నుంచి మండల స్థాయి బృందాల వరకు ధాన్యం కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని, మండలాల్లో మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఎంపీడీవో అధ్యక్షతన ధాన్యం కొనుగోలు నిర్వహించాలని సూచించారు. సన్న, దొడ్డు రకం ధాన్యంకు వేర్వేరు కొనుగోలు



దూర దృశ్య శ్రవణ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి. చిత్రంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, అధికారులు

కేంద్రాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీవోలు శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, నల్గొండ ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీదేవి, డీఎస్పీలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలి.. నల్గొండ విద్యావిభాగం: నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న డీఎస్సీ-2024 ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను, సిబ్బంది పరిశీలిస్తున్న ధ్రువపత్రాల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిశీలనకు హాజరుకాని అభ్యర్థుల దరఖాస్తుల లోని ఫోన్ నెంబర్ ఆధారంగా సమాచారం తెలుసుకుని నిర్ధారించుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పరిశీలన చేపట్టాలన్నారు. మొత్తం 1525 మంది అభ్యర్థులకు గాను శుక్రవారం సాయంత్రం వరకు 1165 మంది పరిశీలన చేయించుకున్నారు. ఇంకా 360 మంది అభ్యర్థులు పరిశీలన చేయించుకోవాల్సి ఉందని విద్యాధికారులు తెలిపారు.

సమగ్రంగా డిజిటల్ సర్వే.. నల్గొండ జిల్లా పరిషత్తు: ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కుటుంబ డిజిటల్ కార్డు సర్వే సందర్భంగా ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని సర్వే చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. నల్గొండ పురపాలికల పరిధిలోని నాలుగో వార్డులో కొనసాగుతున్న డిజిటల్ సర్వేను శుక్రవారం తనిఖీ చేశారు. వార్డు పరిధిలో కుటుంబాల సంఖ్య, ఇప్పటి వరకు సర్వే చేసిన గృహాలు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బేస్ డేటా ఆధారంగా సర్వే నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఇళ్లను వదలకుండా సర్వే చేయాలన్నారు. ఆర్డీవో శ్రీదేవి, పుర కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్ పాల్గొన్నారు.

ఉపాధి ప్రణాళికలు



జాల గ్రామంలో ఉపాధిహామీ పనుల గుర్తింపు గ్రామసభకు హాజరైన అధికారులు, స్థానికులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే :

ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కల్పిస్తుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు ఉన్న గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిరుపేదలకు బాసటగా నిలుస్తుంది.

ఉమ్మడి జిల్లా సమాచారం..

జాబ్ కార్డులు	జిల్లా	ఉపాధి కూలీలు
3,53,029	నల్గొండ	7,60,181
2,61,126	సూర్యాపేట	5,77,294
1,38,806	యాదాద్రి	2,57,919

★ 2025-26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల తీరుపై ప్రణాళికల రూపకల్పనకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతితో పనులు గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై గాంధీ జయంతి రోజు నుంచి ఈ గ్రామసభల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు వరకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

నెలాఖరు వరకు గ్రామసభల నిర్వహణ ప్రక్రియ

పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్టుకాల్వల పనులను చేపట్టారు.

భూగర్భ జలాల పెంపు పనులకు ప్రాధాన్యం..

★ ఈ సారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

ఆమోదం రాగానే...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల్లోని 1740 గ్రామ పంచాయతీలలో ఈ నెలాఖరులోపు గ్రామ సభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం వెంటనే గ్రామాల్లో సదరు పనులను ఉపాధికూలీల ద్వారా చేపట్టనున్నారు.

రోగులకు మెరుగైన సేవలు

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల నుంచి పీహెచ్‌సీకి పలు అనారోగ్య కారణాలతో వస్తున్న రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలందించాలని నల్గొండ డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన అన్ని విభాగాల్లో తిరిగి దస్త్రాలను పరిశీలించారు. 'ఆశా డే' సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మిర్యాలగూడ, దేవరకొండ డిప్యూటీ



అడవిదేవులపల్లి పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

డీఎంహెచ్‌వోలు డాక్టర్ గీతారాణి, డాక్టర్ కేశా రవి, అడవిదేవులపల్లి ఎంవో డాక్టర్ అజహర్‌అహ్మద్, డాక్టర్ రామాంజనేయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలున్నారు.



బతుకమ్మ వచ్చినా.. మూటల్లోనే


నకిరేకల్ పుర కార్యాలయంలో ఏడాది నుంచి మూటల్లో మూలుగుతున్న బతుకమ్మ చీరలు

నకిరేకల్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ మళ్లీ వచ్చింది.. గతేడాది పండగ కోసం తెచ్చిన బతుకమ్మ చీరల్లో మిగిలినవి పంపిణీకి నోచుకోవడం లేదు. ఏడాది నుంచి కార్యాలయాల్లో మూటల్లోనే మూలుగుతున్నాయి. చీరలు దుమ్ము పట్టి పోతున్నా.. వాటిపై ముసుగులు కప్పేస్తున్నారు. గత ఏడాది అక్టోబరులో అప్పటి ప్రభుత్వం మహిళలకు పండగ కానుకగా బతుకమ్మ చీరలు పంపిణీ చేసింది. పంపిణీ మొదలు పెట్టిన ఆరు రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చీరలు పంచడాన్ని నిలిపివేశారు. ఆ తర్వాత కొలువు దీరిన కొత్త ప్రభుత్వం చీరల పంపిణీపై నిర్ణయం తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. అప్పుడు పంపిణీ చేయకుండా మిగిలిన చీరలను పంచాయతీ, పుర కార్యాలయాలు, రేషన్ దుకాణాల్లో ఉన్నాయి. ఇలా మిగిలిన చీరల వివరాలను తొమ్మిది నెలల క్రితం అధికారులు సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు చీరల కానుకలను పంపిణీ చేయాలన్న యోచనలో ఈ ప్రభుత్వం ఉంది. బతుకమ్మ పండుగకు మహిళలకు ఏం ఇవ్వాలనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బుధవారం ప్రకటించడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా పంచకుండా మిగిలిన చీరలు లక్షల సంఖ్యలో ఉన్నాయి. 2023 అక్టోబరులో నకిరేకల్ మండలం, పురపాలికకు 21,250 బతుకమ్మ చీరలు రాగా కోడ్ అమల్లోకి వచ్చేనాటికి 6,657 చీరలను మాత్రమే పంపిణీ చేశారు. 14,593 చీరలు కార్యాలయాల్లోని మూటల్లో నేటికి మూలుగుతున్నాయి.

★ నిల్వ ఉన్న చీరలపై తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి మార్గదర్శకాలు అందలేదని నకిరేకల్ పుర కమిషనర్ డి.బాలయ్య చెప్పారు.



గతేడాది జిల్లాల వారీగా లబ్ధిదారులు, చీరల వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	వచ్చిన చీరలు (లక్షల్లో)
నల్గొండ	5.61	4.00
సూర్యాపేట	3.27	2.96
యాదాద్రి	2.98	2.26





చికెన్ ధరలు			
ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

యాదాద్రి శిల్పాలపై అవతారమూర్తులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: హైందవ సంస్కృతికి దర్పణం పట్టే దేవతామూర్తులతో యాదాద్రి క్షేత్రంలో శిల్పస్తూపాలు భక్తజనులకు ఆధ్యాత్మిక ఆహ్లాదం కలిగిస్తున్నాయి. క్షేత్రాభివృద్ధిలో భాగంగా ఏకజాతికి చెందిన కృష్ణశిలతో రూపొందించిన అష్టభుజి మండప ప్రాకారాలలోని స్తూపాలపై చెక్కి, మహావిష్ణువు దాల్చిన అవతారాలను ఆవిష్కృతం చేశారు. స్తూపాలపై ఉన్న ఈ రూపాలు కనువిందుగొల్పుతున్నాయి. శ్రీలక్ష్మీనారాయణ స్వామి, కూర్మావతారం, రామావతారం, వరహావతారం రూపాలే కాకుండా ఇతర దేవుళ్ల రూపాలను పొందుపరిచారు.


కూర్మావతారం


రామావతారం


వరహావతారం


శ్రీలక్ష్మీనారాయణులు

దసరా సెలవులు.. విజ్ఞాన నెలవులు





చరవాణికి దూరం..



విద్యా సంస్థలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, హోం వర్క్ సన్నద్ధతతో హడావుడిగా గడిపారు. కాస్త సమయం దొరికినా స్మార్ట్ చరవాణి చూసేవారు. ప్రస్తుత సెలవుల్లో చరవాణికి అపరిమితంగా అవకాశం ఇవ్వొద్దు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. గంటలకొద్దీ ఫోన్‌లో గడిపే పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టండి. చరవాణికి అలవాటు పడితే సెలవుల అనంతరం పాఠశాలల సమయాల్లోనూ మనసు చదువుపై నిమగ్నం చేయలేరు.

పెద్దలను గౌరవించడం నేర్పుదాం..



సెలవుల్లో కుటుంబ సభ్యులు తమ నేపథ్యాన్ని చెప్పాలి. ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరామనే విషయాన్ని వివరించాలి. పరస్పరం గౌరవించే విధానాన్ని అలవర్చాలి. సెలవుల్లో పిల్లలను బంధువుల ఇళ్లకు పంపిస్తుంటారు. పెద్దలను గౌరవించడం నేర్పించాలి. ఇందుకోసం రోజులో కొంత సమయాన్ని కేటాయించాలి. వారితో కలిసి భోజనం చేయడం, సరదాగా.. స్నేహపూర్వక వాతావరణంలో మెలుగుతూ ఉండాలి.

నాంపల్లి, న్యూస్‌టుడే: సమయం వెలకట్టలేనిది.. ప్రణాళికతో ముందుకెళ్తే ప్రతి క్షణం ఉన్నతులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుంది. ప్రభుత్వం విద్యార్థులకు ఈ నెల 14 వరకు దసరా సెలవులు ప్రకటించింది. వీటిని విద్యార్థులు వినోదంతో పాటు విజ్ఞానమయంగా మార్చుకోవచ్చు.

ప్రోత్సాహంతో.. ఉత్సాహం..




పిల్లలకు ఆసక్తి ఉన్న ఆట పాటలతో పాటు నచ్చిన కళల వైపు ప్రేరేపించేందుకు సెలవులు మంచి సమయంగా భావించాలి. చిత్రలేఖనం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం, వాద్యం ఇతర అంశాలనే నేర్చుకునే దిశగా ప్రేరేపించి, ఫలితంగా వాటిపై పట్టు సాధించవచ్చు.

సంస్కృతి నేర్పిస్తే..



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల ప్రభావం ఎంతో ఉండేది. చిన్నా.. పెద్దా అంతా కలిసి ఉండేవారు. సెలవుల్లో అమ్మమ, నాయనమ్మ, బంధువుల ఇళ్లకు వెళ్లడం పరిపాటి. ఇదే అదనుగా సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వేదికగా మార్చుకోవాలి. పండుగల విశిష్టతను తెలియజేయాలి.

పుస్తకం వైపు మరలేలా..



మారుతున్న పరిస్థితుల్లో పిల్లలు పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. అత్యధికులు ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ఎనలేని విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఇక్కడ చదివిన ఎంతో మంది గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. సెలవుల నేపథ్యంలో ప్రతి రోజు ఉదయం లేదా సాయంత్రం పిల్లలను ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న విజ్ఞాన భాండాగారాలకు తీసుకెళ్లాలి. పుస్తకాలు, నిఘంటువులు, పత్రికలు అక్కడ అందుబాటులో ఉంటాయనే విషయాన్ని తెలియజెప్పాలి. తద్వారా వారిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుంది.

ఒక్క ఊరోళ్లముయ్యాలో.. ఒకటేమేమంత ఉయ్యాలో..


బీబీనగర్ మండలం మహాదేవపురంలో ఒకే రకమైన చీరలతో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఒకే రకమైన చీరలు కట్టుకొని బతుకమ్మ ఆడుతున్న మహిళలు గ్రామాల్లో సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. బతుకమ్మ ఆటలో పేద, ధనిక అని భేదాభిప్రాయం లేకుండా ఉండేందుకు నూతన విధానం అమలు చేస్తున్నారు బీబీనగర్ మండల మహిళలు. గతంలో పట్టు వస్త్రాలు, నగలు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే వారు అలా పేద, ధనిక భేదం వస్తోందని భావించి మహిళలంతా ఒక్కటే అని చాటి చెప్పేందుకు బీబీనగర్ మండలంలోని మహాదేవపురం, కొండమడుగు, రహీంఖాన్‌గూడ, బీబీనగర్, వెంకిర్యాల గ్రామాల్లో పలువురు మహిళలు ఇలాంటి వేడుకకు వాట్సప్ గ్రూప్‌ల ద్వారా పిలుపునివ్వడంతో మిగతా మహిళలు కూడా అనుసరించారు. గ్రామాల్లో ఒక్క ఊరుల్లోముయ్యాలో.. ఒక్కటేమేమంత ఉయ్యాలో.. అంటూ పూల పండగను వైభవంగా జరుపుకొంటున్నారు. - న్యూస్‌టుడే, బీబీనగర్

ఎంజీయూ బీఈడీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం బీఈడీ ఫలితాలను శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.అల్వాల రవి, అదనపు కంట్రోలర్ డా.లక్ష్మీ ప్రభ విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్‌లో 92.6శాతం, మూడో సెమిస్టర్‌లో 79.30శాతం, రెండో సెమిస్టర్‌లో 84.96శాతం, మొదటి సెమిస్టర్‌లో 77.07శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

నల్గొండ సిగలో మరో కలికితురాయి

జిల్లా కేంద్రంలో ట్రిపుల్ ఐటీ ప్రాంగణం ఏర్పాటుకు సన్నాహాలు

ఈనాడు, నల్గొండ : జిల్లా కేంద్రం నల్గొండ మరో ఉన్నత విద్యా సంస్థకు వేదిక కానుందా..? అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం అవుననే అంటోంది. బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయాన్ని (ఆర్‌జీయూకేటీ)కి అనుబంధంగా మరో రెండు కొత్త ప్రాంగణాలను ప్రారంభించాలని భావిస్తున్న ప్రభుత్వం.. అందులో ఒకటి నల్గొండలో ఏర్పాటు చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాంగణాలను ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో త్వరలోనే మాట్లాడనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విద్యాసంస్థల పరంగా మిగతా జిల్లాలతో పోలిస్తే కొంత వెనకబడ్డ నల్గొండ జిల్లాలో ట్రిపుల్ ఐటీ ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తే ఇక్కడి గ్రామీణ విద్యార్థులకు మేలు జరగనుంది. ప్రాంగణం ఏర్పాటుకు అవసరమైన భూమి ఎక్కడుందనే దానిపై ఆరా తీయాలని నల్గొండ, సూర్యాపేట జిల్లాల అధికారులను ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే మౌఖికంగా సూచించినట్లు సమాచారం. నల్గొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల చుట్టుపక్కల ప్రభుత్వ భూముల లభ్యత, అవసరాలపై అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. మరో వైపు ఎంజీ విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన ప్రాంగణం ఏర్పాటు చేసి భూ సేకరణ అనంతరం పక్కా భవనాల నిర్మాణం చేయాలనే ఆలోచనను కొంత మంది అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే ట్రిపుల్ ఐటీ ప్రాంగణం ఏర్పాటుకు ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయని.. వారం పది రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు రెవెన్యూ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో అభిప్రాయపడ్డారు.

మనస్తాపంతో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

శాలిగౌరారం, తిరుమలగిరి, న్యూస్‌టుడే: చేయని దొంగతనం నింద తనపై మోపి.. పోలీస్ స్టేషన్‌లో పెట్టి కొట్టించారని మనస్తాపం చెందిన టిప్పర్ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం శాలిగౌరారం మండలం ఆకారంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారానికి చెందిన టిప్పర్ డ్రైవర్ నాగరాజు తిరుమలగిరి మండలంలోని ఓ క్రషర్ మిల్లులో కొంత కాలంగా పని చేస్తున్నాడు. మిల్లు యజమాని నాలుగు నెలలుగా తనకు జీతం ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని, జీతం డబ్బులు అడిగితే టిప్పర్ల డీజిల్ దొంగతనం చేశావని తనపై కేసు పెట్టాడని, దీంతో తిరుమలగిరి ఎస్సై కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని బాధితుడు నాగరాజు తన స్నేహితులకు సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా చెప్పాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నాగరాజు ఆకారంలో తన వ్యవసాయ బావి వద్ద తీసిన వీడియో ఆధారంగా అతని స్నేహితులు వెళ్లి చూసే సరికి ఉరి వేసుకొని అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం నల్గొండ ప్రైవేటు ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు బంధువులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధి, మిల్లు యజమాని చెబితేనే ఎస్సై తీవ్రంగా కొట్టాడని నాగరాజు చెప్పారు. స్పందించిన స్థానిక ప్రజాప్రతినిధి సామాజిక మాధ్యమాల్లో మాట్లాడిన వెంకన్నకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తూ బలవన్మరణ యత్నం చేసుకునే విధంగా భయభ్రాంతులకు గురిచేసిన యజమానిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. డీజిల్ చోరీ జరగడంపై ఆరుగురిపై మిల్లు యజమాని ఫిర్యాదు చేశారని, దర్యాప్తు చేయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్సై వి.సురేశ్ తెలిపారు. వారే మాట్లాడుకుంటామని వెళ్లారని, నేను ఎలాంటి చిత్రహింసలకు గురి చేయలేదని తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: పరిమితికి మించిన వేగంతో లారీ దూసుకు రావడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన కల్మెడతండా వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. మరో ఐదు నిమిషాల్లో తన ఇంటికి చేరాల్సిన వ్యక్తి అనంత దూరాలకు వెళ్లిపోయాడు. ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ దర్గా ఆవాస గ్రామం కల్మెడతండా నివాసి, రేషన్ డీలర్ ధరావత్ శివరాం నాయక్(68) ద్విచక్రవాహనంపై వ్యవసాయ పనుల నిమిత్తం దామరచర్లకు వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించాడన్నారు. తెలుగు రాష్ట్రాల్లో నాటకరంగంలో అనేక పాత్రల్లో రాణించి పలు అవార్డులు సాధించిన శివరాంనాయక్ మృతిపై పలువురు కళాకారులు, గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


శివరాం నాయక్

కారు బోల్తా.. భర్త మృతి

భార్యతోపాటు మనుమరాలికి గాయాలు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కారు బోల్తా పడటంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం మండలంలోని అడివెంల స్టేజీ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం పెదనెమిల గ్రామానికి చెందిన, సర్వాయి పాపన్న గౌడ్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రేసు రాములు(49), అతని భార్య అంజమ్మ, మనుమరాలుతో కలిసి తుంగతుర్తిలో తన రెండో కుమార్తె ఇంట్లో శుభకార్యానికి వెళ్లి కారులో తిరుగు పయనమయ్యారు. అడివెంల స్టేజీ సమీపంలో కారు అదుపు తప్పి కల్వర్టు గోడను ఢీ కొట్టడంతో బోల్తాపడి నుజ్జునుజ్జయ్యింది. చుట్టుపక్కల వారు వచ్చి కారులోంచి రాములుతో భార్య, మనుమరాలును బయటికి తీశారు. అప్పటికే రాములు మృతి చెందారు. అతని భార్య, మనుమరాలుకు గాయాలు కావడంతో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు. వివాహం కాని చిన్న కుమార్తె ఇటీవలనే ఉన్నత చదువుల నిమిత్తం లండన్‌కు వెళ్లారు. ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై బాలకృష్ణ తెలిపారు.


రేసు రాములు

చెరువులోకి ఎప్పుడొస్తావ్.. చేపా..!



భానుపురి, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేప పిల్లల విడుదలలో జాప్యం నెలకొంటోంది. అదను దాటుతుండటంతో చేప పిల్లల విడుదల ఉంటుందా లేదా అని మత్స్యకారుల్లో సందిగ్ధం నెలకొంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2,431 చెరువులను మత్స్యశాఖ అధికారులు ఎంపిక చేశారు. నిరంతరం నీళ్లుండే నీటి వనరుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉండగా.. సెప్టెంబరు ముగిసినా ఒక్క చెరువులోనూ విడుదల చేయలేదు.

టెండర్లు ఆలస్యమే

జూన్, జులైలోనే టెండర్లు పూర్తి చేసి ఆగస్టు నాటికి చేప పిల్లలు వదలాల్సి ఉంది. ఉచిత చేప పిల్లల పంపిణీ అమలుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఆలస్యంగా ఉత్తర్వులు రావడంతో జులై 10 నుంచి టెండర్లను ఆహ్వానించగా పెండింగ్ బిల్లులు చెల్లించని కారణంగా గుత్తేదారులు ముందుకురాలేదు. ఆగస్టు 2 వరకు పొడిగించినా స్పందన లేదు. ఆగస్టు 23 వరకు టెండర్ల గడువును పొడిగించడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 మంది గుత్తేదారులు ముందుకొచ్చారు. నల్గొండలో ఐదుగురు, సూర్యాపేట నలుగురు, యాదాద్రి ముగ్గురు మాత్రమే టెండర్లలో పాల్గొన్నారు. వీరికి చెరువులు లేకపోవడం, చేపలు పెంచకపోవడంతో ఉన్నతాధికారులు పరిశీలన చేసి ఆ టెండర్లను రద్దు చేశారు. మళ్లీ కొత్తగా పిలిచారు. నేటికీ గుత్తేదారుల ఎంపిక చేపట్టలేదు.


గతేడాది విడుదల చేసేందుకు తీసుకొచ్చిన చేప పిల్లలు

ఉమ్మడి జిల్లా వివరాలు..


జిల్లా	మత్స్య సంఘాల సభ్యులు	గుర్తించిన చెరువులు	చేప పిల్లల లక్ష్యం (కోట్లల్లో..)
నల్గొండ	27,000	953	6
సూర్యాపేట	15,366	620	3.41
యాదాద్రి	10,000	658	2.71

ఉపాధికి దెబ్బ

చెరువుల్లో ఆలస్యంగా చేప పిల్లలు వదిలితే అవి ఎదిగే అవకాశం ఉండదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నల్గొండ 27,000, సూర్యాపేట 15,366, యాదాద్రి 10,000 సంఘం సభ్యులు ఉన్నారు. వీరంతా చేపల వేటపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఈసారి నేటికీ చెరువుల్లో మీనాలను విడుదల చేయకపోవడంతో వేసవిలో నీళ్లింకే సమయానికి చేపలు ఎదగక నష్టం జరిగే అవకాశం ఉంది.

క్షేత్ర పరిశీలన చేసి ఖరారు చేస్తాం

-నాగులు నాయక్, జిల్లా మత్స్య శాఖ అధికారి, సూర్యాపేట



గుత్తేదారులు చేప పిల్లల పెంపకం చేపడితేనే టెండర్ అప్పగిస్తాం. ఇటీవల పెంపకం చేపట్టకుండా టెండర్‌లో పాల్గొన్న వారిని రద్దు చేశాం. మళ్లీ నలుగురు టెండర్లలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అప్పగించిన వెంటనే చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం.

పెంచుతున్నారు.. కూరగాయల సాగు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో వినియోగదారులు ఇక్కట్లు పడుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లు సాగు విస్తీర్ణం లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. విత్తనాలు అందించే పథకం గత కొన్నేళ్లుగా నిలిచిపోయింది. విత్తనాల పంపిణీ స్థానంలో నారును ఉచితంగా అందించే పథకాన్ని అమలు చేస్తున్నారు.

ముందస్తు దరఖాస్తు తప్పనిసరి

ఉమ్మడి జిల్లాలో మిరప, టమాట, వంగ తోటలు సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ఉచితంగా నారు అందించనున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఎంతైనా నారు ఇవ్వడానికి ఉద్యాన శాఖ ముందుకు వచ్చింది. కావాల్సిన రైతులు నెల రోజుల ముందుగా సంబంధిత ఉద్యాన శాఖ అధికారికి దరఖాస్తు చేయాలి. ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నర్సరీలో టమాట, మిరప, వంగ నారు మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

అవగాహన లేక..

కూరగాయల సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నా.. ఉచితంగా అందించే నారుకు సంబంధించి ప్రచారం లేకపోయింది. దీంతో కూరగాయల సాగుపై ఆసక్తి చూపట్లేదు. నారును నర్సరీ నుంచి తెచ్చుకోవడానికి రవాణా ఖర్చులు కూడా ఉద్యాన శాఖ చెల్లిస్తోంది. కావాల్సిన రైతులు ముందస్తుగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

సాయిబాబ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, నల్గొండ

ఆసక్తి గల అన్నదాతలు ఉచితంగా అందించే మిరప, టమాట, వంగ నారును తీసుకొని సద్వినియోగం చేసుకోవాలి. నారు కావాల్సిన రైతులు 20 నుంచి నెల రోజుల ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలి. నాణ్యమైన నారు అందిస్తాం.


మిరప నారు

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ డివిజన్‌లో కాలుష్యంతో క్యాన్సర్ బాధితులు పెరిగిపోతున్నందున ప్రభుత్వం పెద్ద క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని తెలంగాణ మట్టిమనుషుల కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు కోరారు. మిర్యాలగూడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసియా ఖండంలోనే అత్యధిక బియ్యం, సిమెంటు పరిశ్రమలు, దక్కన్ క్రోమైటు వ్యర్థాలు క్యాన్సర్ కారకంగా ఉన్నాయన్నారు. కల్తీ ఆహారంతో అనారోగ్య సమస్యలు పెరిగిపోగా ఇటీవల క్యాన్సర్ కేసులు వెలుగు చూస్తున్నాయన్నారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని సర్వే నంబరు 626, అలగడప గ్రామంలోని 829, 833, 834 సర్వేనెంబర్లలోని ప్రభుత్వ భూముల్లో ఆసుపత్రి నిర్మించాలన్నారు.

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలోని మిషన్ కంపౌండ్, ఖిల్లాబజార్‌లోని ట్యాంకుల్లో నీరు అపరిశుభ్రంగా వస్తుంది. క్లోరినేషన్ చేయాలి. –ఆర్.మోహనయ్య, దేవరకొండ

✔ తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేయిస్తాం. –రాజు, పురపాలిక ఏఈ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని 32వ వార్డు బంగారుగడ్డలో యూపీహెచ్‌సీ సమీపంలోని ఖాళీ స్థలంలో వ్యర్థాలను 15 రోజులుగా తరలించకపోవడంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. –సయ్యద్ అమీర్ అలీ, మిర్యాలగూడ

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. –ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

మాజీ మంత్రి పరామర్శ



వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన భారాస రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి తల్లి మృతి చెందటంతో శుక్రవారం రాత్రి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

11 ఏళ్లు జైలుశిక్ష

త్రిపురారం: ఉమ్మడి త్రిపురారం మండలంలోని అభంగాపురం గ్రామానికి చెందిన కడియం సుధాకర్‌పై త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో 2016లో ఎస్సీ, ఎస్టీ, హత్యాచారం కింద కేసు నమోదైంది. ప్రస్తుతం ఆ గ్రామం మాడ్గులపల్లి మండలంలో ఉంది. శుక్రవారం జిల్లా కోర్టులో విచారణ నిర్వహించగా జడ్జి రోజా రమణి హత్యాచారం కింద 10 ఏళ్లు, ఎస్సీ ఎస్టీ కేసు కింద ఏడాది, మొత్తం 11 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు త్రిపురారం ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఆహ్లాదం.. ఆనందవేళ

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ పట్టణంలో ప్రజలు సేద తీరేందుకు ఏర్పాటు చేస్తున్న పార్కు చూడచక్కగా మారింది. పార్కు నిర్మాణం తుది దశకు చేరడంతో పిల్లలు, పెద్దలు సాయంత్రం వేళ సేదదీరుతున్నారు. నిత్యం పట్టణ ప్రజలు శబ్ద, వాయు కాలుష్యం, పని ఒత్తిడితో తడబడుతున్న వారికి ఇన్నాళ్లు పార్కు లేకపోవడంతో ఇంటికే పరిమితమయ్యేవారు. ప్రస్తుతం దేవరకొండ ఖిల్లా దుర్గం అవరణలో రూ.5 కోట్లతో నాలుగున్నర ఎకరాల్లో పార్కు నిర్మాణం అందమైన పూలతో చేపడుతున్నారు. ఇప్పటికే చిన్నపిల్లల ఆట వస్తువులు, సేద తీరేందుకు పార్కు, చిన్న చిన్న ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు స్టేజి, పార్కులో షాపులు వంటివి నిర్మాణం చేపట్టారు. త్వరగా పార్కు నిర్మాణం పూర్తయి పట్టణ ప్రజలకు అందుబాటులోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. వీలైనంత తొందర్లో పార్కు ప్రారంభానికి సన్నాహాలు పూర్తి చేస్తున్నట్లు పురపాలిక ఏఈ రాజు తెలిపారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న దేవరకొండ ఖిల్లా పార్కు

వైద్య శిబిరం.. అభినందనీయం

నిడమనూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమని ఎంపీ కుందురు రఘువీర్‌రెడ్డి అన్నారు. బొక్కమంతలపహాడ్‌లో వారం రోజులపాటు చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వారు ఆ గ్రామానికి చెందిన పుట్ట ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం, నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యడవెల్లి రంగశాయిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చివరి రోజైన శుక్రవారం ఎంపీ వైద్యశిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. దాదాపు 150 మందికి వరకు అత్యాధునిక వైద్య పరికరాలతో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరం నిర్వహించిన ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను, రంగశాయిరెడ్డిని అభినందించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంకతి సత్యం, యడవెల్లి నరేందర్‌రెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, కుందూరు లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు ప్రభుత్వం వారికిచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభలో పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బొంద పార్వతి, సైదమ్మలను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, గౌతంరెడ్డి, రాధాబాయి, ప్రమీల, స్వరాజ్యం, రశీదా, అరుణ, శోభ, విజయ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ పైలాన్‌లో నిర్మిస్తున్న నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. పైలాన్‌కాలనీ బైపాస్ రోడ్డు వెంట లక్ష్మణ్‌నాయక్ ఇంటి నిర్మాణ చేస్తుండగా.. రోడ్డు ఆక్రమించి నిర్మిస్తున్నారని నందికొండ మున్సిపల్ కమిషనర్ శ్రీనుకు సిబ్బందితో వెళ్లి దానిని తొలగించారు. అనంతరం బాధితుడు కుటుంబసభ్యులతో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. స్థానిక భారాస నాయకుడు రమేష్, చంద్రమౌళి మద్దతు పలికారు. పైలాన్ బైపాస్‌రోడ్డు లక్ష్మణ్‌నాయక్ రోడ్డు ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో దానిని తొలగించాలని చెప్పామని, అయినా పట్టించుకోకుండా నిర్మాణం చేస్తుండటంతో నిబంధనల ప్రకారమే దానిని తొలగించామని కమిషనర్ శ్రీను తెలిపారు.

అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఫిర్యాదు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: కాస్తు కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న కొందరి భూమిని వారికి తెలియకుండా అక్రమంగా తమ కుటుంబసభ్యుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పాల్వాయి గ్రామంలో సుమారు 30 కుటుంబాలకు చెందిన 22 ఎకరాల పట్టా భూములను, 154, 217, 417లోని ప్రభుత్వ భూములను అదే గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా పట్టా చేసుకున్నాడు. అతనిపై కేసు నమోదు చేసి, తిరిగి పట్టాలు చేయాలని తహసీల్దారు కిరణ్‌కుమార్‌కు బాధితులు గురువారం ఫిర్యాదు చేశారు.

అర్హులందరికీ ఆరోగ్య కార్డులు: ఎమ్మెల్యే



అచ్చంపేటపట్టి గ్రామంలో హెల్త్ ప్రొఫైల్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ హెల్త్‌కార్డు సర్వే జాగ్రత్తగా నిర్వహించాలని, త్వరలోనే అర్హులందరికీ కార్డుల పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. డిజిటల్ పైలెట్ గ్రామంగా ఎంపికైన అచ్చంపేటపట్టి గ్రామాన్ని గురువారం సందర్శించి కుటుంబ సర్వేను పరిశీలించారు. కార్డుల జారీలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా వివరాలను నమోదు చేయించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మి, మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జాని యాదవ్, సిరాజ్‌ఖాన్, హరికృష్ణ, లచ్చిరాంనాయక్, లక్ష్మానాయక్, భద్యానాయక్‌లు ఉన్నారు.

చందంపేట: నేనావత్ నందులాల్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం తెల్దేవరపల్లి గ్రామంలో మృతుడు నేనావత్ నందులాల్ మృతదేహానికి పూలమాలేసి నివాళులర్పించారు. లక్ష్మానాయక్, గోవింద్, హరికృష్ణ, లచ్చిరాం, పాపానాయక్, పాండు, రమేష్ ఉన్నారు.

దేవరకొండ: ఆయిల్ పాం సాగుతో లాభాలు అర్జించేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన నల్గొండ జిల్లా ఆయిల్ పాం రైతుల అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు సాయిబాబ, ఏపీడీ శ్రీనివాసులు, యాదగిరి, సుబ్బారెడ్డి, కిరణ్, రాజాగౌడ్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మిర్యాలగూడలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బీఎల్ఆర్ పేర్కొన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డిని శుక్రవారం మిర్యాలగూడలో సత్కరించి మాట్లాడారు. ఎంఈవోలు బాలునాయక్, బాలాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, వెంకన్న, సంఘం నాయకులు నర్సింహారెడ్డి, గుడిపాటి కోటయ్య, గోపీనాయక్, మామిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, గుర్రికాల సుదర్శన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని 207 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. తహసీల్దారు హరిబాబు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, బాలు, సైదులు, బసవయ్య, గిరి పాల్గొన్నారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, వెంకటేశ్వర: దేవర, శ్రీనివాస: శ్వాగ్,
విట్రోస్: మత్తు వదలరా-2, దేవర, సత్యం సుందరం,శ్వాగ్,

బైక్ దొంగిలించిన కేసులో జైలు, జరిమానా

నిడమనూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం దొంగిలించిన కేసులో నిందితుడికి, నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి బీఎస్ఎన్ సుమబాల ఏడు నెలల జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించారు. కోర్టు లైసన్ అధికారి అలీఅహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరిసాగర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన మేడం ప్రతాప్ 18.01.2024నాడు తన అత్తగారి ఊరైన పెద్దవూర మండలం లింగంపల్లికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రాత్రి వాహనాన్ని ఇంటి ముందు ఉంచి నిద్రిస్తున్న సమయంలో గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన కత్తి రవికుమార్ దాన్ని దొంగిలించాడు. దీనిపై ప్రతాప్ మరుసటి రోజు పెద్దవూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్సై వీ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి పట్టుకొని శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. పీపీ ఎం.సాధన పిటీషనర్ తరపు వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ రవినాయక్ అందుకు సహకరించారు.

నకిలీ మావోను పట్టించిన సాంకేతికత

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: మావోయిస్టునని ఓ రైస్‌మిల్లు వ్యాపారిని బెదిరించి సాంకేతికత (ఫోన్‌పే) ద్వారా డబ్బు తీసుకున్న ఓవ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం వనపర్తి కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి ఇటీవల వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మిల్లు యజమాని శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను మాజీ మావోయిస్టునని.. రైస్ మిల్లు అసోసియేషన్ నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. డబ్బులివ్వకుంటే చంపుతానని బెదిరించారు. ఈ నెల 2న హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని కమిషన్ బేస్డ్ వ్యక్తికి చెందిన ఫోన్‌పే నంబరుకు రూ.8 వేలు జమ చేయాలని శేఖర్‌రెడ్డికి చెప్పారు. బాధితుడు రూ.8 వేలు పంపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖిల్లాగణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడు డబ్బు తీసుకునేందుకు కమిషన్ బేస్డ్ వ్యక్తి ఇంటి వద్దకు రాగా కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాగణపురం ఎస్సై సురేశ్‌గౌడ్ పట్టుకున్నారు. అతన్ని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. నిందితుడు పెద్దపల్లిలో సుల్తానాబాద్, కరీంనగర్, సుబేదారి, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొందరిని బెదిరించి డబ్బు తీసుకోవడంతో కేసులు నమోదయ్యాయి.

ఈదురు గాలుల బీభత్సం



మండలంలోని దుగ్గేపల్లిలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో క్రశశికలకు చెందిన శ్రీసాయి మాధవ గో సంరక్షణ కేంద్రం పైకప్పు రేకుల ఎగిరిపోయాయి. దీంతో గోవులకు నిలువ నీడ లేకుండా పోయిందని బాధితులు రైతు శుక్రవారం వాపోయారు. -త్రిపురారం, న్యూస్‌టుడే:

పూలవనం విరిసె.. పాటలతో మురిసె



మిర్యాలగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సీడీపీవో మమత, తదితరులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం బుతకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, సిబ్బందితో కలిసి సీడీపీవో మమత బతుకమ్మ ఆడి ఉత్సాహాన్ని నింపారు. కౌన్సిలర్ చంద్రకళ, నజీమా బేగం, రాధిక, సుశీల, లీలాకుమారి, పద్మ, హేమాదేవి, శ్రీదేవి, పద్మ, సరిత, ఝాన్సీ, రమాదేవి, నాగమ్మ, స్వరూప, సుని పాల్గొన్నారు.

మిర్యాలగూడ: బతుకమ్మ వేడుకలను మిర్యాలగూడ మీనా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాధవి దంపతులు పాల్గొని విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడి ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నేటితరం యువత కృషి చేయాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఛైర్మన్ మహిమూద్ అలీ, వనితా క్లబ్ నాయకురాలు రాయపూడి భవాని, కళాశాల డైరెక్టర్ షలహబుతుల్, వాణి, మగ్ధూమ్, పూజ, భారతి, ఆస్మా, అరుణ, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాధవి దంపతులు..

కొనసాగుతున్న సర్వే

త్రిపురారం, న్యూస్‌టుడే: మండలంలోని కొణతాలపల్లిలో నిర్వహిస్తున్న కుటుంబ డిజిటల్ సర్వే రెండోరోజు కొనసాగింది. శుక్రవారం గ్రామంలోని 71 గృహాల్లో సర్వే చేయగా కొత్తగా.. మరో 27 గృహాల్లో సర్వే నిర్వహించినట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. తహసీల్దార్ ప్రమీల, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, రెవెన్యూ, పంచాయతీ, సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలో డిజిటల్ సర్వే 50శాతం పూర్తయినట్లు పుర కమిషనర్ శ్రీను తెలిపారు. ఆయన మాట్లాడుతూ పుర పరిధిలోని 11 వార్డుల్లో మొత్తం 300 కుటుంబాలుండగా గురువారం 72, శుక్రవారం 102 కుటుంబాల సర్వే చేసినట్లు, సోమవారం వరకు పూర్తి స్థాయిలో చేయనున్నట్లు పేర్కొన్నారు. పెద్దవూర మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, పెద్దవూర తహసీల్దార్ సరోజపావని, ఆర్ఐలు శ్రీనివాసరెడ్డి, పుర సిబ్బంది బాలాజీ, మహేష్, వార్డు అధికారులు పాల్గొన్నారు.



వేములపల్లి: రావులపెంటలో..




దేవరకొండ భక్తమార్కండేయస్వామి దేవాలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు

ఘన పూజలందుకున్న.. గాయత్రీదేవీ



చింతపల్లిలో దేవి నవరాత్రి ఉత్సవాలు

మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం అమ్మవారు గాయత్రీ దేవీగా పూజలందుకున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు.



అడవిదేవులపల్లిలోని మహిషాసురమర్ధిని ఆలయంలో..

నూతన కమిటీ నియామకం

హాలియా, న్యూస్‌టుడే: హాలియా వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఛైర్మన్‌గా పెద్దవూర మండలం చలకూర్తికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా తిరుమలగిరిసాగర్ మండలం బోయగూడెం గ్రామానికి చెందిన కలసాని చంద్రశేఖర్‌ను నియమిస్తూ వ్యవసాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 18 మంది సభ్యులతో కూడిన కమిటీలో గుండెబోయిన లక్ష్మయ్య, రావులపాటి శంకరయ్య, సజ్జల రఘుపతిరెడ్డి, ఎస్‌కే గౌస్, గోర్ల ఇద్దయ్య, ఆంగోతు పాండునాయక్, మొసంగి వెంకటేశ్వర్లు, శాగం మంగమ్మ, ఊర వెంకన్న, రమావత్ రాములు, వీరమళ్ల శ్రీనివాస్, చిట్టిపోలు యశ్వంత్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



చంద్రశేఖర్‌రెడ్డి

అవీ ఇవీ

బాధిత కుటుంబానికి పరామర్శ.. హాలియా: మండలంలోని పులిమామిడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెరుకుపల్లి రాములు అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతిచెందారు. శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి.. రాములు మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు నకిరేకంటి సైదులుమాదిగ, రాజేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, లక్ష్మయ్య, అశోక్ తదితరులున్నారు.

చందంపేట: తెల్‌దేవరపల్లి గ్రామానికి చెందిన నేనావత్ నందులాల్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. తెల్‌దేవరపల్లి గ్రామాన్ని సందర్శించి మృతదేహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. లోక్యనాయక్ వడ్త్య బాలు, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌కృష్ణ, కృష్ణ, గోవర్ధన్ ఉన్నారు.

వినతి.. కొండమల్లేపల్లి: స్థానిక వినాయక్‌నగర్‌లో ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్న 33కేవీ విద్యుత్ తీగల వల్ల ప్రమాదం పొంచి ఉందని.. విద్యుత్ లైన్‌ను తొలగించాలని కోరుతూ శుక్రవారం కాలనీవాసులు డీఈ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. యాదగిరిరెడ్డి, శ్రీను, లక్ష్మీనారాయణ, నర్సిరెడ్డి, వెంకటయ్య, శ్రీను, జంగయ్య, ఖదీర్ తదితరులున్నారు.

అంధురాలికి చేయూత.. వేములపల్లి: మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామానికి చెందిన పున్నమ్మ భర్త జానయ్య 20 ఏళ్ల క్రితం చనిపోయారు. గత కొన్నేళ్లుగా ఆమెకు కళ్లు కనిపించడం లేదు. ఆమె నిత్యావసర వస్తువులు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, దేవాలయ కమిటీ మాజీ ఛైర్మన్ యల్లపల్లి వెంకటేష్ రూ.8వేల విలువైన సరకులు, 50కేజీల బియ్యం, నగదు అందజేశారు. తక్కెళపల్లి శ్యామ్, ప్రశాంత్, విక్రమేంద్ కుమార్, బచ్చు వెంకన్న, రాము తదితరులున్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన.. మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టాలని అందరూ కృషి చేయాలని సంస్థ సభ్యులు కోరారు. సంస్థ సభ్యులు కవిత, రాయుడు, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం.. చింతపల్లి: మండలంలోని వింజమూరు గ్రామంలో బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వీరయ్య, శంకరయ్య, మైసయ్య పాల్గొన్నారు.

భాజపాను బలోపేతం చేయాలి.. మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో భాజపాను బలోపేతం చేయాలని నియోజకవర్గ సభ్యత్వ ఇన్‌ఛార్జి పోతెపాక సాంబన్న సూచించారు. మాడ్గులపల్లిలో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, మండలాధ్యక్షుడు బొమ్మకంటి నర్సింహ, ఇందిర, జాన్‌రెడ్డి, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదఘాతంతో పాడి గేదె మృతి.. పెద్దవూర, న్యూస్‌టుడే: మండలంలోని బాసోన్‌బాయి గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన కున్‌రెడ్డి గోవింద్‌రెడ్డి తన పాడి గేదెలను రోజులాగే మేపడానికి తీసుకెళ్లగా విద్యుత్ స్తంభానికి కరెంటు సరఫరా అవుతున్న స్టే వైర్‌కు తాకి గేదె అక్కడికక్కడే మృతిచెందింది.

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

డాక్టరేట్ అందజేత

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డా.బీఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని జర్నలిజం మాస్ కమ్యునికేషన్ విభాగం అసిసెంట్ ప్రొఫెసర్, ఇన్‌ఛార్జి విభాగాధిపతి యాదగిరి కంభంపాటికి ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజంలో డాక్టరేట్ ప్రకటించింది. మాజీ ఎమ్మెల్సీ ప్రొ.నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఓయూ జర్నలిజం శాఖ నుంచి ప్రమోషనల్ స్ట్రాటజీస్ ఇన్ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఏ కేస్ స్టడీ అంశంపై యాద


యాదగిరి

గిరి పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టొరల్ డిగ్రీ లభించింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన యాదగిరి అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖలో చేరక డిగ్రీ, పీజీ స్థాయిలలో జర్నలిజం మాస్ కమ్యునికేషన్ ప్రజా సంబంధాల కోర్సుల నాణ్యతను విస్తృత స్థాయిలో పెంచేందుకు కృషి చేశారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టాలని అందరూ కృషి చేయాలని సంస్థ సభ్యులు కోరారు. సంస్థ సభ్యులు కవిత, రాయుడు, ఝాన్సీ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని అబ్బాసీ కాలనీ రోడ్డు నంబరు రెండులో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. నివారించాలని మున్సిపల్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు.
– నరేందర్, నల్గొండ.

✔ పందుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేస్తాం.
– శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక

విశ్రాంత పోలీస్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: విశ్రాంత పోలీస్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని శుక్రవారం స్థానిక పోలీస్ ఆడిటోరియంలో జరిగి సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా


ఎన్నికైన పోలీస్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

ఎండీ హసన్, కోశాధికారిగా భూపాల్‌రెడ్డితో పాటు ఇతర కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయరాజు మాట్లాడుతూ విశ్రాంత పోలీస్ ఉద్యోగులకు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తామన్నారు. సోమయ్య, ఎండీ అలీ, సురేందర్‌రెడ్డి, ప్రభాకర్, జంగయ్య, గఫార్, సోమిరెడ్డి, యూసుఫ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత

కనగల్, న్యూస్‌టుడే: కురంపల్లి నుంచి పొనుగోడు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చక పోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు అంటూ 'రోడ్డు మధ్యలో గుంత.. మరమ్మతులు ఎప్పుడంటా..!' అంటూ శుక్రవారం 'ఈనాడు'లో కథనం రావడంతో గ్రామానికి చెందిన యువకులు వెంకన్న, మహేందర్, మారుతి, చందు, రవి, కుమార్‌లు గుంతలో బండరాళ్లను నింపి దానిపై మట్టి పోసి చదును చేశారు.

స్పందనకు వందనం

తాగునీరు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

'న్యూస్‌టుడే'తో నకిరేకల్ పుర ఛైర్‌పర్సన్ చౌగోని రజిత ముఖాముఖి

నకిరేకల్, న్యూస్‌టుడే:

తాగునీరు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యంతో కృషి చేస్తానని నకిరేకల్ పురపాలక సంఘం నూతన ఛైర్‌పర్సన్ చౌగోని రజిత చెప్పారు. నకిరేకల్‌ను ఆదర్శ పురపాలికగా అభివృద్ధి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో



తమ పాలక వర్గం పని చేస్తుందని వివరించారు. తనకు తక్కువ సమయమే ఉన్నా.. అదనపు నిధులు సాధించి పుర అభివృద్ధికి పాటుపడతానని వెల్లడించారు. పురపాలిక తొలి మహిళా ఛైర్ పర్సన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రజిత 'న్యూస్ టుడే' ముఖాముఖిలో శుక్రవారం పలు వివరాలు వెల్లడించారు.

గృహిణిగా, పుర ఛైర్‌పర్సన్‌గా సమన్వయం

కుటుంబ పనులు తగ్గించుకునైనా సమస్యల పరిష్కారం కోసం పుర పాలనపై దృష్టి పెట్టేందుకు కృషి చేస్తాను. నకిరేకల్ మేజర్ పంచాయతీలో వార్డు సభ్యురాలిగా పని చేశాను. మూడేళ్ల నుంచి కౌన్సిలర్‌గా ఉన్నాను. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కౌన్సిల్‌లో జరిగే చర్చలు, నిర్ణయాలు, పుర నిధుల రాక, వ్యయంపై అవగాహన ఉంది.

తక్కువ సమయంలో అభివృద్ధికి తీసుకునే కార్యాచరణ

వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ప్రతి వార్డులో రూ.20 లక్షలతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం. ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో మంత్రులు, సీఎంను కలిసి నకిరేకల్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు సాధించేందుకు కృషి చేస్తాను. తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించి ఆ దిశగా ముందుకు సాగుతాను.

అనూహ్యంగా ఛైర్‌పర్సన్ అయ్యారు, ఎలా భావిస్తున్నారు.. ప్రధాన కర్తవ్యాలు

మూడేళ్ల క్రితం కౌన్సిలర్‌గా ఎన్నికైనప్పుడు ఛైర్‌పర్సన్ అవుతానని అనుకోలేదు. ఈ పదవిని చేపట్టడాన్ని బాధ్యతగా భావిస్తున్నా. పుర ప్రజలకు నా వంతుగా సేవ చేయాలన్న లక్ష్యంతో ఉన్నాను. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యంతో పని చేస్తాను. ప్రతి ఇంటికి సాగర్ (కృష్ణా జలాల) తాగు నీరు అందించాలన్నదే ధ్యేయం. రూ.25 కోట్లతో అమృత్ ద్వారా తాగునీటి పథకం పనులు మొదలయ్యాయి. ఇవి సకాలంలో పూర్తి చేయించేందుకు కృషి చేస్తాను.

కమ్యూనిస్టులతోనే పేదలకు న్యాయం

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టులతోనే పేదలకు న్యాయం చేకూరుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ అన్నారు. చిట్యాల మండలం సుంకెనపల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామ శాఖ మహా సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శి, సహాయ కార్యదర్శులుగా పంతంగి నర్సింహ, చిట్టిపోలు జనమేజయ లను ఎన్నుకున్నారు. కోన పూరి లింగారెడ్డి, కత్తుల లింగస్వామి, కక్కిరేణి నర్సింహ, ముత్యాలు, యాదయ్య, స్వామి పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

కేతేపల్లి: వానాకాలం సీజనులో మూసీ ఆయకట్టులో పండిన వరి ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేస్తామని కేతేపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావు చెప్పారు. వానాకాలం ధాన్యం కొనుగోలు విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ద్వారా 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగేశ్వర్‌రావు, సీఈవో వి.నర్సయ్య, ఏపీఎం యాదమ్మ, ఏఈఓలు నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా పోరాటం

నీలగిరి, న్యూస్‌టుడే: ఎల్ఐసీని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వం కుట్రలకు వ్యతిరేకంగా నిర్వహించే కార్యక్రమాలలో ఏజెంట్లు ముందుండి పోరాడాలని ఏజెంట్ల ఆర్గనైజేషన్ జాతీయ వర్కింగ్ ప్రసిడెంటు మంజునాథ్ కోరారు. స్థానిక టీఎన్జీవో భవన్‌లో శుక్రవారం ఏజెంట్లకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. యాజమాన్యం ఏజెంట్లకు కమీషన్ పెంచాల్సింది పోయి తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలసీదారులకు బోనస్ పెంచకుండా ఏర్పాటు చేసిన నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సౌత్ జోనల్ కార్యదర్శి నర్సింహారావు, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు కుమార్, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు నలపరాజు సైదులు, శివశంకర్ పాల్గొన్నారు.



ఎల్ఐసీ ఏజెంట్ల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సంఘం జాతీయ వర్కింగ్ ప్రసిడెంటు మంజునాథ్

ఫుట్‌బాల్ క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి ఖమ్మం జిల్లాలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో నల్గొండ ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన వెంకటసాయి, యశ్వంత్, అన్వర్, మణిరామ్, హర్షవేదార్య, సోని పాల్గొననున్నారు. ఈ క్రీడాకారులకు కేఎన్.బయోసైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లాకు పేరు తీసుకు రావాలని కోరారు. కేఎన్.బయోసైన్సెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి రామానుజ, ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొమ్మపాల గిరిబాబు, శ్రీ సత్యం వర్మి ఆర్గానిక్స్ కన్సల్టెన్సీ ప్రతినిధులు కిరణ్, భానుప్రసాద్, కర్ణాకర్, లింగయ్య, బాలరాజు, సైదులు, పాల్గొన్నారు.


ఫుట్‌బాల్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రామానుజ, గిరిబాబు, తదితరులు

ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు పోరాటం

నీలగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు పోరాటం ఆపేది లేదని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ స్పష్టం చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం ప్రస్తుతం చేపట్టిన ఉద్యోగ నియామకాలలోనే ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన మాట మర్చిపోయాడని ఆరోపించారు. ఉపాధ్యాయ నియామకాలలో వర్గీకరణ అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.వెంకన్న మాదిగ, నాయకులు బోడ సునీల్ మాదిగ, ఆడెపు నాగార్జున మాదిగ, ఏడుకొండలు మాదిగ, స్వామి మాదిగ, మోహన్ మాదిగ, సైదులు మాదిగ, శ్రీను మాదిగ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ

కార్మికుల కూలి ధరలు పెంచాలి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పవర్ లూమ్ కార్మికుల కూలీ ధరలు పెంచాలని, లేకుంటే 20వ తేదీ తరువాత ఏ రోజు నుంచి అయిన నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించినట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి తెలిపారు. పట్టణంలోని పద్మానగర్‌లో శుక్రవారం జరిగిన తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరలు పెంచాలని యజమానులకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చామని వివరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, దండెంపల్లి సత్తయ్య, సైదాచారి, రాములు, యోగానందం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నీటి సరఫరాపై అవగాహన అవసరం

కనగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉండే వాటర్ మెన్‌లకు నీటి సరఫరాతో పాటు మరమ్మతులపై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.వెంకటేశ్వర్లు అన్నారు. నాలుగు రోజుల పాటు కనగల్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రామ మంచి నీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వారికి ధ్రువపత్రాలు అందజేశారు. డీఈఈలు బి.సంపత్, రవి, ఎంపీవో సుమలత, ఏఈలు శఫీయొద్దీన్, పంకజ్, మీనా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఆటోను ఢీకొట్టిన కారు: డ్రైవర్ మృతి

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం ఎల్లగిరి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన మిట్టపల్లి నర్సింహ(46)కు ఆటో కలదు. చిట్యాలకు చెందిన బారాల లక్ష్మమ్మ పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఆమె పండ్లను కొనుగోలు చేసేందుకు రంగారెడ్డి జిల్లా కొత్తగూడెంలోని పండ్ల మార్కెట్‌కు నర్సింహ ఆటోలో బయలుదేరింది. ఎల్లగిరి క్రాస్‌రోడ్డులోని సంగెం హోటల్ వద్దకు చేరుకోగానే ఆటోను వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతదేహానికి చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై కృష్ణమల్ సూరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.


నర్సింహ

బాలిక అదృశ్యం

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: బాలిక అదృశ్యమైన ఘటన చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) గత నెల 26న ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తెల్లవారుజామున తల్లిదండ్రులు నిద్రలేచి చూసేసరికి కూతురు కనిపించలేదు. స్నేహితులు, బంధువులను విచారించగా ఫలితం లేకపోవడంతో బాలిక తండ్రి ఉయ్యాల లింగస్వామి ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.ధర్మా తెలిపారు.

వీపు తోమాలని అరిచిన భర్త తల పగులకొట్టిన భార్య

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: భర్తపై క్షణికావేశంలో భార్య దాడి చేసిన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుమన్ వివరాల ప్రకారం.. నల్గొండకు చెందిన శివ గుత్తేదారు. భార్య, పిల్లలతో కేపీహెచ్‌బీ మూడో రోడ్డులో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం శివ స్నానం చేసే సమయంలో వీపు తోమాలని భార్యపై గట్టిగా కేకలు పెట్టాడు. చుట్టుపక్కల వారు వింటే బాగుంటుందా అని ఆమె క్షణికావేశంలో చేతికందిన రాయితో భర్త తలపై కొట్టడంతో రక్తస్రావం అయ్యింది. ఆనక రక్తం కారడం చూసి బోరున ఏడ్చింది. దీనిపై శివ పోలీసులకు ఫిర్యాదు చేసి కొన్ని రోజులు ఉండొస్తానని సొంతూరుకు వెళ్లిపోయాడు.

జలాభిషేకం

కట్టంగూరు, న్యూస్‌టుడే: కట్టంగూరులో శ్రీకంఠ మహేశ్వర స్వామి-సురమాంబ కల్యాణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌడ సామాజికవర్గం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రతి ఇంటి నుంచి బిందెలలో నీటిని తీసుకెళ్లి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. శనివారం గ్రామ దేవతల శాంతి పూజలు, బోనాలతో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని గౌడ సంఘం కమిటీ తెలిపింది.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కనగల్, న్యూస్‌టుడే: దసరా పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నల్గొండ కమిటీ ఆధ్వర్యంలో లింగాలగూడెంలో ప్రచారం నిర్వహించారు. దసరా పండుగలోని ఆధ్యాత్మికంపై ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం, చక్రధర్, చంద్రమౌళి, రంగారెడ్డి, కమలాకర్, వెంకటమ్మ, కవిత పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ దర్వాజల ప్రతిష్ఠ

నల్గొండ కల్చరల్: పాతబస్తీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం గర్భగుడి దర్వాజల ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేనేపల్లి లక్ష్మణ్‌రావు, బండారు ప్రసాద్, ఉపాధ్యక్షులు వీరెల్లిచంద్రశేఖర్, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, పిల్లిరామరాజు యాదవ్, కౌన్సిలర్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయం గర్భగుడి దర్వాజల ప్రతిష్ఠా మహోత్సవ పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

చండూరు, న్యూస్‌టుడే: నకిలీ పురుగు మందులు విక్రయిస్తే ఎరువుల దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మునుగోడు వ్యవసాయ సంచాలకులు వేణుగోపాల్ దుకాణదారులను హెచ్చరించారు. తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కేతమళ్ల యాదయ్య ఓ పురుగు మందును పిచికారీ చేయడం వల్ల తన పదెకరాల పత్తి చనిపోయిందని ఆరోపించగా.. వ్యవసాయ అధికారులు శుక్రవారం ముత్తయ్య వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి పత్తి నమూనాలను కంపాసాగర్ శాస్త్రవేత్తలతో నిర్ధారణ చేయించారు. ఆ మందు వాడటం వల్ల చేను నష్టపోలేదని తేల్చారు. అనంతరం మండలంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఏవో రేవతి, నాగార్జున, తదితరులు ఉన్నారు.


తనిఖీ చేస్తున్న వ్యవసాయ సంచాలకులు వేణుగోపాల్, చిత్రంలో వ్యవసాయ అధికారిణి రేవతి

స్త్రీలు గౌరవంగా జీవించేందుకు బతుకమ్మ


ఊట్కూరులో బతుకమ్మలతో విమలక్క

శాలిగౌరారం, న్యూస్‌టుడే: స్త్రీలు గౌరవంగా జీవించేందుకు గ్రామ గ్రామాన బహుజన బతుకమ్మ నిర్వహించడం జరుగుతుందని అరుణోదయ సాంస్కృతిక సమైక్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. శాలిగౌరారం మండలంలోని ఊట్కూరులో శుక్రవారం రాత్రి బహుజన బతుకమ్మ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ఆడపడుచులతో కలిసి బతుకమ్మలను ఆడారు. అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి మల్సూర్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్, రమేష్, రాకేష్, సుధాకర్, చెరుకు లక్ష్మి, అన్నెబోయిన సుధాకర్, వేముల రామచంద్రు, కొమరయ్య, పల్స యాదగిరి, వేముల గోపీనాథ్, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

నల్గొండ టౌన్: నల్గొండ పట్టణంలోని కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో రంగు రంగుల బతుకమ్మలను పేర్చి మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు ఆడి పాడారు. సంప్రదాయ దుస్తుల్లో అమ్మాయిలు సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


నల్గొండ కాకతీయ కళాశాలలో..

కుల వివక్ష నిర్మూలనకు కృషి

చిట్యాల, న్యూస్‌టుడే: కుల రహిత సమాజ సాధనలో భాగంగా కుల వివక్ష రక్కసిని ప్రజా స్వామిక వాదులంతా నిర్మూలించాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ పేర్కొన్నారు. తమ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిట్యాలలో శుక్రవారం ఆయన సంఘం పతాకాన్ని ఎగురవేశారు. బొడ్డు బాబూరావు, నగేశ్, శంకరయ్య, రాములు పాల్గొన్నారు.


చిట్యాలలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ

ఆలయాన్ని పూర్తి చేస్తాం

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లో మార్కండేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణాన్ని భక్తులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో పూర్తి చేస్తామని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాదుదుద్దల కృష్ణమూర్తి చెప్పారు. స్థపతి దామోదరాచారితో ఆలయ పునాదులను శుక్రవారం పరిశీలించారు. పెండెం సదానందం, మల్లయ్య, గౌరయ్య, యాదగిరి, నరేందర్ పాల్గొన్నారు.


నకిరేకల్: ఆలయ పునాదులు పరిశీలిస్తున్న అధ్యక్షుడు కృష్ణమూర్తి, స్థపతి దామోదరాచారి

సినిమాలు నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** మత్తు వదలరా 2
నకిరేకల్: **రామకృష్ణ**- శ్వాగ్ , **వెంకటేశ్వర**- దేవర

అవీ ఇవీ

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థులు.. నకిరేకల్: మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నారని పాఠశాల హెచ్ఎం కె.వీరారెడ్డి, పీడీ చైతన్య కుమార్ శుక్రవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న జి.వెంకటేశ్వర్లు, ఎం.అనిల్, కె.సాయికుమార్, పి.లోకేశ్, కె.సంజయ్‌లు నారాయణపేట జిల్లా కోస్గిలో ఈ నెల 5 వరకు ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే 68వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లారని వివరించారు.

ఆర్థిక సాయం.. మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నైట్‌వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్‌నాయక్ భార్య అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. పూర్వ ఉపాధ్యాయులు ఖర్చుల నిమిత్తం శుక్రవారం రూ.10వేలను అతనికి అందజేశారు. టీఎస్‌యూటీఎఫ్ మండల మాజీ అధ్యక్షుడు మహేశ్వరం వెంకటేశ్వర్లు, అంజనేయులు, అభిలాష్, కొండల్ పాల్గొన్నారు.

ఫిర్యాదు... కట్టంగూరు: దుగినవెల్లి గ్రామంలోని ఒకటో వార్డులో వీధిని ఆక్రమించి నిర్మాణం చేపట్టిన గృహాన్ని తొలగించాలని ఆ వార్డు ప్రజలు నర్సింహ, లక్ష్మయ్య, ముత్యాలు, లింగమ్మ, లక్ష్మి తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పరామర్శ... మాడ్గులపల్లి: దాచారం గ్రామానికి చెందిన బొల్లెపల్లి లచ్చయ్య అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతదేహానికి నివాళి అర్పించిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్లెంల సైదులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకన్న, జానయ్య, నాగిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

విశేషంగా అమ్మవారికి పూజలు


మర్రిగూడలో.. అమ్మవారు

కనగల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ అమ్మవారు గాయత్రి దేవీగా పూజలందుకున్నారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. లేత గులాబి రంగు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భవానీ స్వాములు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

నల్గొండ కల్చరల్: దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారి మండపాలలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు అర్చనలు జరిపించారు. భవాణి స్వాములకు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.


శ్రీరాంనగర్ కాలనీలో..

కట్టంగూరు: దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు శ్రీ గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. కట్టంగూరు మండలం చెర్వుఅన్నారం, మునుకుంట్లలో భక్తులు పూజలు జరిపారు.

మర్రిగూడ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు.

గట్టుప్పల: మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవస్థానంలో రెండోరోజు గాయత్రి దేవి పూజ కార్యక్రమాన్ని గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాస్, పండితులు బ్రహ్మశ్రీ పాపయ్యశర్మ, శివానందం, విద్యాసాగర్ పాల్గొన్నారు.


కట్టంగూరు మండలం చెర్వుఅన్నారంలో..


కనగల్: చంద్రహారతి ఇస్తున్న అర్చక స్వాములు

చిట్యాల: చిట్యాల కనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారగోని ఆంజనేయులు, ఆలయ అధికారి అంబటి నాగిరెడి, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.


రాక్‌హిల్స్ కాలనీలో..


నల్గొండ కల్చరల్: అమ్మవారి మండపంలో...


రామకోటి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలో భక్తులు